ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 41 | పేజీలు: 4 | వెల: రూ.3/- | మంగళవారం 21 మే 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



## లోయలోపడిన వ్యాన్
### 17 మంది మృతి

న్యూఢిల్లీ, మే 20 (ప్రభాత ఉదయం): ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఓ పికప్ వ్యాన్ అదుపుతప్పి 20 అడుగుల లోతున్న లోయలో పడిపోయింది. ఈ ఘటనలో సుమారు 17 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 25 మంది గాయాలపాలయ్యారు. కవార్ధాలో సోమవారం ఈ ప్రమాదం జరిగింది. సెమ్హరా గ్రామానికి చెందిన గిరిజనులు తునికాకు

..మిగతా 2లో

## సన్నవడ్లకు క్వింటాల్‌కు
# రూ.500 బోనస్



### యాసంగిలో 35 లక్షల టన్నుల ధాన్యం సేకరణ
### మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ
### తడిసిన ధాన్యం కూడా మద్దతు ధరలకే సేకరణ
### స్కూళ్ల ఆధునీకరణకు 600 కోట్లు కేటాయింపు
### మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన కమిటీ ఏర్పాటు
### కాళేశ్వరంపై ఎన్‌డిఎస్‌ఎ ఆదేశాల మేరకు చర్యలు
### జూన్ 2న రాష్ట్ర అవతరణ వేడుకలకు సోనియాకు ఆహ్వానం
### కేబినేట్ భేటీ నిర్ణయాలను వెల్లడించిన మంత్రులు

హైదరాబాద్, మే 20 (ప్రభాత ఉదయం): రైతులకు వచ్చే సీజన్ నుంచి రూ.500 పంట బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. యాసంగిలో రైతుల పండించిన ధాన్యం సుమారు 36 లక్షల మెట్రిక్ టన్నులు పౌరసరఫరాల శాఖ సేకరించింది. ఈ సేకరించిన ధాన్యానికి 3 రోజులలోపే గతంలో రైతులకు ఎన్నడూ లేనట్లుగా బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ సర్కార్ ఎప్పుడూ ధాన్యాన్ని ఇలా సేకరించలేదు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ధాన్యం వేగంగా సేకరించడంతో పాటు 3 రోజుల్లోపే నగదు జమ చేశామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మూడు గంటలకు పైగా కొనసాగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ వేడుకల్ని ఘనంగా నిర్వహించాలని, ఈ వేడుకలకు ఏఐసీసీ అగ్రనాయకురాలు సోనియా గాంధీని ఆహ్వానించాలని కేబినెట్ నిర్ణయించింది. ధాన్యం కొనుగోళ్లపై పూర్తి బాధ్యత కలెక్టర్లకే అప్పగించారు. రైతులకు నష్టం జరగకుండా చివరి గింజ వరకూ కొనాలని సీఎం ఆదేశించారు. కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్‌బాబు మీడియాకు వెల్లడించారు.అకాల వర్షాలతో ప్రభుత్వం చర్యలు తీసుకున్నా ధాన్యం తడిచిపోయింది. తడిచిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాలని కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ధాన్యం తడిచిన రైతులు ఆందోళన చెందవద్దని, కనీస మద్ధతు ధరకే కొంటామని భరోసా ఇచ్చారు. ఎలక్షన్ కోడ్ ఉండటంతో ఎన్నికల సంఘం అనుమతితో తెలంగాణ మంత్రివర్గం సోమవారం సమావేశమైంది. రాష్ట్ర రైతులకు సీజన్ ప్రారంభం కాబోతోంది, పండించిన ధాన్యం సమస్య ఉంది, స్కూల్స్ ప్రారంభం కానున్నాయి, కాళేశ్వరం ప్రాజెక్టుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఓ నివేదిక ఇచ్చింది. దానిపై చర్చించేందుకు కేబినెట్ భేటీ అయినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకం, హాస్టల్స్, రేషన్ బియ్యం, ఇతర పథకాలు 36 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. ఎన్నికల సమయంలో సన్న బియ్యం ఇస్తామని చెప్పినట్లు చేస్తామన్నారు. సన్న వడ్లు పండించిన రైతులకు వచ్చే సీజన్ నుంచి రూ.500 పంట బోనస్ ఇస్తామని ప్రకటించారు. విత్తనాలు, ఎరువులు, రైతులకు సంబంధించి ఇతరత్రా అంశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపుతాం. అధికారిక కంపెనీల ద్వారా విత్తనాలు కొనుగోలు చేయాలని, రిసీప్ట్ ను పంట వచ్చే వరకు భద్రపరుచుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. జూన్ 12న స్కూళ్లు ప్రారంభం కానున్నాయి. సుమారు రూ.600 కోట్లు వెచ్చించి అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా స్కూళ్లను ఆధునీకరిస్తున్నామని చెప్పారు. స్కూళ్లను మోడ్రన్ పాఠశాలలుగా చేసి

..మిగతా 2లో





## ఇరాన్ అధ్యక్షుడు
# రైసీ దుర్మరణం
### సంతాప దినం ప్రకటించిన భారత్

న్యూఢిల్లీ, మే 20 (ప్రభాత ఉదయం): ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం పాలైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ప్రపంచ దేశాలు దిగ్భ్రాంతి వ్యక్తంచేశాయి. ఈ క్రమంలోనే రైసీ గౌరవార్థం భారత్‌లో మే 21న ఒక రోజు సంతాప దినం పాటించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దేశవ్యాప్తంగా జాతీయజెండాను అవనతం చేయడంతోపాటు అధికారిక వేడుకలకు దూరంగా ఉండాలని కేంద్ర హెూంశాఖ ఆదేశాలు జారీ చేసింది. 1989లో ఇరాన్ తొలి సుప్రీంలీడర్ అయతొల్లా రుహెూల్లా ఖొమేనీ కన్నుమూసిన సమయంలోనూ భారత్ మూడు రోజులు సంతాప దినాలు పాటించింది. ఇరాన్ అధ్యక్షుడి దుర్మరణం.. ఇజ్రాయెల్ ప్రమేయం ఉందా? అంతకుముందు రైసీ మృతిపై భారత ప్రధాని నరేంద్రమోదీ తీవ్ర విచారం వ్యక్తంచేసిన విషయం తెలిసిందే. "ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇరుదేశాల మధ్య సంబంధాల బలోపేతానికి ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఆయన కుటుంబసభ్యులకు, ఆ దేశ ప్రజలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని ప్రధాని 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఇదిలాఉండగా.. ఈ హెలికాప్టర్ ప్రమాదంలో రైసీతోపాటు ఇరాన్ విదేశాంగ మంత్రి హెుస్సేన్ అమీరబొల్లహియన్, తూర్పు అజర్‌బైజాన్ ప్రావిన్సు గవర్నర్ మలేక్ రహ్మతీ తదితరులు కన్నుమూశారు. హెలికాప్టర్ ప్రమాదంలో ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ దుర్మరణం చెందడంతో ప్రపంచ దేశాలు ఉలిక్కిపడ్డాయి. అయితే, మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ రైసీ ప్రమాదానికి గురికావడం చర్చనీయాంశమయ్యింది. హెలికాప్టర్ ప్రమాదంలో శత్రుదేశం ఇజ్రాయెల్ పాత్ర ఉందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే టెల్‌అవీవ్ స్పందించింది. రైసీ మరణంలో తమకు ఎటువంటి ప్రమేయం లేదని అంతర్జాతీయ మీడియా సంస్థకు స్పష్టంచేసింది. ఇజ్రాయెల్- హమాస్ యుద్ధం వేళ.. సిరియాలో ఇరాన్‌కు చెందిన జనరల్‌ను నెతన్యాహు సైన్యం మట్టుపెట్టడం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఇందుకు దీటుగా స్పందిస్తామని హెచ్చరించిన ఇరాన్.. శత్రు దేశంపై డ్రోన్‌లతో విరుచుకుపడింది. వాటిని ఇజ్రాయెల్ దళాలు నిలువరించినప్పటికీ.. ఈ పరిణామాలు రెండు దేశాల మధ్య యుద్ధానికి దారితీయొచ్చనే ఆందోళన నెలకొంది. ఇలా

..మిగతా 2లో



## ఇళ్లు లేని వారందరికీ
# ఇందిరమ్మ ఇళ్లు
### తొలిదశలో అత్యంత పేదలకు అవకాశం
### అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు
### అన్యాయంగా కార్డు ఉన్నవారు సరెండర్ చేయాలి
### ప్రజల వద్దకే శ్రీనన్న కార్యక్రమంలో మంత్రి పొంగులేటి

ఖమ్మం, మే 20 (ప్రభాత ఉదయం): తెలంగాణలో మార్పు కావాలని ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నామని, ఇళ్ళు లేని ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. గ్రామంలో ఉన్న పాఠశాల, రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం త్వరలోనే పూర్తి చేపిస్తామన్నారు. త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, పెన్షన్లు ఇస్తామన్నారు. అయితే అక్రమంగా కార్డులు ఉన్నవారు, అర్హత లేకున్నా పొందిన వారు స్వచ్ఛందంగా కార్డులు వాపస్ చేయాలన్నారు. పాలేరు నియోజకవర్గం తన సొంత ఇల్లు అని, ఎన్నికల కోడ్ అయిపోగానే నియోజకవర్గంలో అభివృద్ధి పనులు మొదలవుతాయన్నారు. ఖమ్మం రూరల్ మండలం, రెడ్డిపల్లి, పోలేపల్లి లో నిర్వహించిన ప్రజా సమస్యలపై ప్రజల వద్దకే శ్రీనన్న కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రజలనుంచి మంత్రి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. గ్రామాల్లో సమస్యలపై మంత్రి శ్రీనివాస్ రెడ్డికి

..మిగతా 2లో

## దేశవ్యాప్తంగా
# ఐదో దశ పోలింగ్
### పలు ప్రాంతాల్లో ఓటేసిన ప్రముఖులు
### అమేథీలో స్మృతి, లక్నోలో రాజ్‌నాథ్, మాయావతిలో ఓటు
### ముంబైలో ఓటేసని అక్షయ్ కుమార్, జాన్వీ



న్యూఢిల్లీ, మే 20 (ప్రభాత ఉదయం): దేశ వ్యాప్తంగా 5వ దశ లోక్ సభ ఎన్నికలకు పోలింగ్ సోమవారం ఉదయం ప్రారంభమయ్యింది. ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లోని మొత్తం 49 నియోజకవర్గాలకు పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురు సినీ రాజకీయ ప్రముఖులు తమ నియోజకవర్గాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రస్తుత బీజేపీ సిట్టింగ్ ఎంపీ స్మృతి ఇరానీ అమేథీ లోక్‌సభ స్థానం నుంచి మరోసారి లోక్ సభ స్థానానికి పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె అమేథీలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. ఓటు వేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 'ఈరోజు తన గ్రామం గౌరీగంజ్‌లో వికసిత్ భారత్ సంకల్పంతో తన ఓటు వేయడం జరిగిందన్నారు. ఇది తన అదృష్టంగా భావిస్తున్నా అన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ ఓటు హక్కును

..మిగతా 2లో



## కవిత జుడీషియల్ రిమాండ్
# పొడిగింపు

న్యూఢిల్లీ, మే 20 (ప్రభాత ఉదయం): ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జుడీషియల్ రిమాండ్ ను కోర్టు మరింత పొడిగించారు. జూన్ 3 వరకూ కవిత రిమాండ్ను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు పొడిగించింది. ఇప్పటికే లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టు అయి తీహార్ జైలులో కవిత రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఆ రిమాండ్ గడువు నేటితో ముగియడంతో తీహార్ జైలు అధికారులు కవితను వర్చువల్ గా రౌస్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. దీంతో కోర్టు జూన్ 3 వరకూ రిమాండ్ ను పొడిగించింది. ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్, సీబీఐ రెండు కేసుల్లోనూ కవిత జుడీషియల్ రిమాండ్ గురించి విచారణ జరిగినట్లు తెలుస్తోంది. కవిత మార్చి నెలాఖరు నుంచి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ అక్రమాలపై ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్, సీబీఐ రెండు సంస్థలు కవితను అరెస్టు చేశాయి. మార్చి 15న ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ కవితను అరెస్టు చేయగా.. ఏప్రిల్ 11న సీబీఐ అరెస్టు చేసింది. అప్పటికే తిహార్ జైలులో రిమాండ్ లో ఉన్న కవితను ఏప్రిల్ 11న సీబీఐ అరెస్టు చేసింది. దీంతో రెండు దర్యాప్తు సంస్థల తరపున కవిత రిమాండ్ లో ఉన్నారు. కవిత బెయిల్ కోసం ఆమె తరుపు న్యాయవాదులు చాలా ప్రయత్నించారు. ఇప్పటికి పలుమార్లు ఆమెకు బెయిల్ రిజెక్ట్ అవుతూ ఉన్న విషయం తెలిసిందే.

# సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్

మొదటి పేజీ తరువాయి...



చూపించడం ఇందిరమ్మ పాలన అన్నారు. దీనిపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి శ్రీధర్ బాబును అధ్యక్షుడిగా నియమించామని చెప్పారు. కాళేశ్వరంపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ రిపోర్ట్ ప్రకారం.. మేడిగడ్డ పగుళ్లు, అన్నారం లీకేజీ, మూడో డ్యామ్ ప్రమాదం ఉందని కనుక.. చుక్క నీరు ఆపోద్దని గేట్లు తెరవాలని రిపోర్టులో ఉందన్నారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే సేకరించాలని నిర్ణయించామని అన్నారు. ఎంఎస్‌పీ కంటే ఒక్క రూపాయి కూడా తక్కువ చెల్లించకూడదని నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రానికి అవసరమైన సన్న బియ్యం అంతా రాష్ట్రంలోనే సేకరిస్తాం అన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులపై నిపుణుల కమిటీ ఏం చెప్తే అది చేయాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు.మంత్రివర్గంలో మేడిగడ్డపై ఎన్‌డీఎస్‌ఏ ఇచ్చిన మధ్యంతర నివేదికపైనా చర్చించినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. కాళేశ్వరం విషయంలో ఎన్‌డీఎస్‌ఏ సూచనలకనుగుణంగా వ్యవహరిస్తామని చెప్పారు. 'మేడిగడ్డకు మరమ్మతులు చేస్తే.. సరి అవుతుందన్న గ్యారెంటీ లేదని, నీరు నిల్వ చేసే పరిస్థితి కూడా లేదని ఎన్‌డీఎస్‌ఏ కమిటీ చెప్పింది. అందుకే, తాత్కాలికంగా ఏమైనా ఏర్పాటు చేసైనా సరే రైతులకు నీరు ఇవ్వాలని భావిస్తున్నాం' అన్నారు.బ్యారేజ్‌ల సేఫ్టీపై ఎక్స్‌పర్ట్ కంపెనీలతో పరిశీలన చేయించి రిపోర్ట్ తీసుకుంటామన్నారు. ఆ రిపోర్ట్ ఆధారంగానే మరమ్మతులు చేపడుతామన్నారు. తక్కువ ఖర్చుతో నీటిని లిఫ్ట్ చేసేందుకు అవకాశం ఉంటే పరిశీలించాలని కేబినెట్ నిర్ణయించిందన్నారు. జూన్ 2తో తెలంగాణ ఏర్పడి పది సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా పబ్లిక్ మీటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సభకు సోనియా గాంధీతో పాటు తెలంగాణ ఏర్పాటుకు కృషి చేసిన వారిని ఆహ్వానిస్తామన్నారు. వేడుకల నిర్వహణకు ఈసీకి లేఖ రాయాలని నిర్ణయించామన్నారు.



# ఇరాన్ అధ్యక్షుడు రైసీ దుర్మరణం

మొదటి పేజీ తరువాయి...

హమాస్ యుద్ధం, సిరియా సంక్షోభం, ఎర్ర సముద్రంలో దాడులు తదితర కీలక పరిణామాలు ఏకకాలంలో తెరపైకి వచ్చిన సమయంలో రైసీ దుర్మరణం పలు అనుమానాలకు దారితీసింది. ఇరాన్‌లో కీలక వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న ఇద్దరు శక్తిమంతమైన నేతలు ప్రమాదంలో చనిపోవడం వెనక విదేశీ లేదా స్థానిక శత్రువుల ప్రమేయం ఉందా? అన్న అనుమానాలు కూడా మొదలయ్యాయి. ఇదే సమయంలో చిరకాల శత్రువుగా ఉన్న ఇజ్రాయెల్ పాత్రను తోసిపుచ్చలేమనే కథనాలు వెలువడ్డాయి. ఇరాన్‌తోపాటు అనేకమంది శత్రుదేశాల సభ్యులను అంతమొందించిన చరిత్ర ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొసాద్‌కు ఉంది. అంతేకాకుండా ఇరాన్‌లో అనేకమంది అణుశాస్త్రవేత్తలను ఇజ్రాయెల్ హత్య చేసిన దాఖలాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు హెలికాప్టర్ ప్రమాదానికి గురికావడం.. దీనివెనక ఇజ్రాయెల్ హస్తం ఉండవచ్చనే అనుమానాలు మొదలయ్యాయి. అయితే, అధ్యక్షుడిని అంతమొందించే సాహసం చేయకపోవచ్చని, ఒకవేళ అదే చేస్తే తీవ్ర పర్యవసానాలు ఎదుర్కోవాల్సి వస్తుందనే వాదన కూడా ఉంది. ఇలా భిన్న కథనాల నేపథ్యంలో స్పందించిన ఇజ్రాయెల్.. తమ ప్రమేయం లేదని పేర్కొంది. మరోవైపు అమెరికా చట్టసభ సభ్యుడు చక్ షుమెర్ ఈతరహా వాదనలను తోసిపుచ్చారు. కుట్ర కోణాలకు ఇప్పటివరకు ఎటువంటి ఆధారాలు కనిపించలేదని అభిప్రాయపడ్డారు.

# దేశవ్యాప్తంగా ఐదో దశ పోలింగ్

మొదటి పేజీ తరువాయి...



వినియోగించుకోండి.. దేశ భవిష్యత్తుకు బాధ్యతగా ఓటు వేయమని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే ఉత్తరప్రదేశ్‌లో కూడా పలు స్థానాలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. మాజీ సిఎం, బిఎస్పి అధినేత్రి మాయావతి లక్నోలోని పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేశారు. అనంతరం సిరా వేలును చూపి అందరినీ ఓటు వేయమని సందేశం ఇచ్చారు. ముంబై నార్త్ నుంచి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పీయూష్ గోయల్ బరిలో నిలిచారు. ఈ సందర్భంగా ఆయన తన ఓటు హక్కును వినియోగించుకుని ముంబై ప్రజలు దేశానికి మంచి భవిష్యత్తు కోసం ఓటు వేస్తున్నారని తెలిపారు. కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ కుటుంబ సమేతంగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేశారు. ఓటు వేసిన తర్వాత సిరా వేసిన వేలిని కూడా చూపించారు. ఉత్తరప్రదేశ్లో కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ కూడా పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో నిలబడి ఓటు వేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఐదవ దశ పోలింగ్ సందర్భంగా నటి సన్యా మల్హోత్రా ముంబైలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈమెతో పాటు పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ కూడా ముంబైలో ఓటు వేశారు. అలాగే బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ కూడా తన ఓటు హక్కును ముంబై నగరంలో వినియోగించు కున్నారు. పౌరసత్వం వచ్చిన తరువాత తాను వేసిన తొలిఓటుగా పేర్కొన్నారు. నటి జాన్వీ తదితరులు కూడా ఓటేశారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత్ దాస్ కూడా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# పిడుగుపాటుకు గేదె మృతి

వికారాబాద్, మే 20 (ప్రభాత ఉదయం): కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలం తిమ్మారెడ్డిపల్లి అనుసంధాన గ్రామమైన బంగ్లా తాండ కు చెందిన లక్ష్మీనాయక్ తండ్రి తిమ్మనాయక్ అనే రైతు గేదె సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఉరుము మెరుపులతోపాటు వర్షం రావడంతో పిడుగుపాటుకు గేదె మృతి చెందింది. ఈ సందర్భంగా రైతు బోరున విలిపిస్తూ లక్ష రూపాయలు అప్పుచేసి తెచ్చుకున్నానని ఇప్పుడు ఆపు ఎలా తీర్చాలో తోచడం లేదని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంత మయ్యారు. పరిస్థితిలో ఉన్న మాకు పిడుగుపాటుకు ఎలా బతకాలో అర్థం కాని స్థితిలో ఉన్నామని బోరున విలపించాడు.

# లోయలోపడిన వ్యాన్

మొదటి పేజీ తరువాయి...

సేకరణ కోసం సమీపంలోని అడవికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వారు ప్రయాణిస్తున్న పికప్ వ్యాన్ కుక్‌దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బహపానీ గ్రామ సమీపంలోకి రాగానే ఒక్కసారిగా అదుపుతప్పి 20 అడుగుల లోతున్న లోయలోకి పడిపోయింది. ఈ దుర్ఘటనలో 17 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. సుమారు 25 మంది గాయాలపాలయ్యారు. ప్రమాద సమయంలో వాహనంలో 35 నుంచి 45 మందిదాకా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు స్థానికుల సాయంతో క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.





# జూన్ 8న చేప ప్రసాదం పంపిణీ

## వెల్లడించిన బత్తిన కుటుంబ సభ్యులు

హైదరాబాద్, మే 20 (ప్రభాత ఉదయం): మృగశిర కార్తె సందర్భంగా ప్రతి ఏడాది.. బత్తిని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేప ప్రసాదం అందిస్తున్నారు. ఈ ఏడాదికూడా చేప ప్రసాదం పంపిణీకి బత్తిని ఫ్యామిలీ సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన వివరాలను వారు మీడియాకు వెల్లడించారు. ఈ ఏడాది మృగశిర కార్తె జూన్ 8న శనివారం ఉదయం పదకొండు గంటలకు ప్రవేశిస్తుంది. జూన్ 8 ఉదయం పదకొండు గంటల నుంచి జూన్ 9వ తేదీ ఉదయం పదకొండు గంటల వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో చేప ప్రసాదం పంపిణీ జరుగుతుందని తెలిపారు. చేప ప్రసాదం పూర్తిగా ఉచితంగా భక్తులకు అందిస్తామని అన్నారు. వివిధ ఫౌండేషన్ల సహకారంతో.. మెడికల్ సర్వీస్, భోజన సౌకర్యం, మంచి నీటి సరఫరా 24 గంటల పాటు ఉచితంగా భక్తులకు ఇస్తామని చెప్పారు.ఆస్తమా, ఉబ్బసం, దమ్ము, దగ్గు వంటి శ్వాస సంబంధ వ్యాధుల నివారణకు చేప మందు ప్రసాదాన్ని అందిస్తున్నామని పేర్కొన్నారు. చేప ప్రసాదం పంపిణీకి గత ప్రభు త్వాలు అన్ని ఏర్పాట్లు చేసిన విధంగానే.. ఈ ప్రభుత్వాన్నిసైతం తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. చేప ప్రసాదం కోసం వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

# ఇళ్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు

మొదటి పేజీ తరువాయి...

వినతిపత్రాలు అందజేసిన ప్రజలు. సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ప్రజలకు మంత్రి శ్రీనివాస్ రెడ్డి తెలియజేశారు. మీ అందరి దీవెనలతో ఎమ్మెల్యేగా గెలిచానని, అడిగిన సమస్యలే కాకుండా అడగని సమస్యలు కూడా పరిష్కరిస్తానని చెప్పారు. ప్రజలు అడిగిన కోరికలు తీర్చే బాధ్యత తనదన్నారు. భవిష్యత్‌లో ఏ సమస్య వచ్చినా ఇందిరమ్మ కమిటీ ద్వారా తనకు తెలియచేయాలని, ప్రజలందరూ సంతోషంగా ఉండాలని మీ పెద్ద కొడుకుగా పనిచేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కష్టపడి నా గెలుపు కోసం శ్రమించి పనిచేసి అద్భుతమైన మెజారిటీతో గెలిపించారు. మీ ఇంటి పెద్దకొడుకుగా మీ అందరి కోసం పనిచేస్తా' అని రెవిన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం నేలకొండపల్లి మండలం గువ్వలగూడెంలో నిర్వహించిన ప్రజల వద్దకె శ్రీనన్న కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో రఘురాం రెడ్డి గెలుపు కోసం కూడా అందరూ కృషి చేశారన్నారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం లేకుండానే ఈ ఐదు సంవత్సరాలు ప్రజలకు సేవ చేస్తానని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని విమర్శించారు. పాలేరు నియోజకవర్గం తన సొంత ఇల్లు అని తెలిపారు. రాబోయే మూడు సంవత్సరాల్లో పాలేరు నియోజకవర్గంలో ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు.పార్టీలకు అతీతంగా పేద వాళ్లలో అతి పెదవాళ్ళకి ఇళు ్ళ ఇవ్వాలన్నది ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పాలేరులో ఏ ఒక్కరూ మంచినీటికి ఇబ్బంది పడకుండా చర్యలు చేపడతామన్నారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి సీసీ రోడ్లు నిర్మాణం చేస్తామని చెప్పారు. గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. నిజమైన పేదవారికి సేవ చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని మరోసారి స్పష్టం చేశారు. వైద్యం, విద్యకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. పాలేరు ప్రజల నమ్మకాన్ని, విశ్వాసాన్ని పోగొట్టుకోనన్నారు. ఎన్నికలు ఉన్నా.. లేకపోయినా నిత్యం పాలేరు ప్రజల మధ్యే ఉంటానని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.



## బెంగళూరులో రేవ్ పార్టీ భగ్నం

### పాల్గొన్న మోడల్స్, టీవీ నటులు - అందులో ఏపీ ఎమ్మెల్యే కారు

బెంగళూరు, మే 20 (ప్రభాత ఉదయం): బెంగళూరులో ఓ రేవ్ పార్టీని అక్కడి సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (సీసీబీ) భగ్నం చేశారు. నగరంలోని ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలో ఓ ఫాం హౌస్లో ఈ పార్టీ జరిగింది. స్థానిక జీఆర్ ఫామ్ హౌస్లో బర్త్ డే పార్టీ పేరుతో పెద్ద ఎత్తున రేవ్ పార్టీని నిర్వహించినట్లుగా బెంగళూరు సీసీబీకి సమాచారం అందడంతో వారు ఆకస్మిక దాడులు చేశారు. ఈ రేవ్ పార్టీలో భారీగా లిక్కర్ తో పాటుగా పెద్ద ఎత్తున డ్రగ్స్ కూడా యువతీయువకులు తీసుకున్నట్లు తెలుస్తోంది. జీఆర్ ఫామ్హౌస్ అనేది హైదరాబాద్కు చెందిన ప్రముఖ వ్యక్తికి చెందినది పోలీసులు గుర్తించారు. ఆయన గోపాల్ రెడ్డికి చెందినదని పోలీసుల విచారణలో తేలింది. రేవ్ పార్టీలో పోలీసులు మాదక ద్రవ్యాలను భారీగా గుర్తించారు. ఈ పార్టీలో ముఖ్యంగా తెలుగు రాష్టాలకు చెందిన వారే అధికంగా ఉన్నట్లు బెంగుళూరు పోలీసులు గుర్తించారు. రేవ్ పార్టీలో తెలుగు సినీ పరిశ్రమకు చెందిన వారు కూడా ఉన్నారని తెలిసింది. ఈ రేవ్ పార్టీలో వైసీపీ ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ పేరుతో పాస్ ఉన్న కారు కూడా గుర్తించినట్లు తెలిసింది. సీసీబీ సోదాల్లో ఎండీఎంఏ సహా పలు డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఐదుగురిని సీసీబీ అదుపులోకి తీసుకుంది. అయితే, సినీ నటి హేమ కూడా ఈ పార్టీలో పాల్గొన్నట్లుగా వదంతులు వచ్చాయి. దీనిపై ఆమె స్పష్టత ఇచ్చారు. ఈ రేవ్ పార్టీలో దాదాపు 70 మంది యువకులు, 30 మంది వరకూ యువతులు పాల్గొన్నట్లు తెలిసింది. వారందరినీ అదుపులోకి తీసుకొని డ్రగ్స్ సేకరించిన వారిని గుర్తించడం కోసం మెడికల్ టెస్టులు చేయించారు. ఈ రేవ్ పార్టీ కోసం హైదరాబాద్ నుంచి విమానంలో వచ్చి మరీ పలువురు హాజరైనట్లు తెలిసింది.

**నేను హైదరాబాద్ లోనే ఉన్నా - హేమ**

"నేను హైదరాబాద్ లోనే ఉన్నాను. నాకు బెంగుళూరు రేవ్ పార్టీతో సంబంధం లేదు. అనవసరంగా నన్ను లాగుతున్నారు. కన్నడ మీడియా, సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదు" అని సినీ నటి హేమ తెలిపారు.

# ఎన్టీఆర్ ఫ్యాన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ జన్మదిన వేడుకలు





ఎన్టీఆర్ జయంతి సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న అభిమానులు

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 20(ప్రభాత ఉదయం)ప్రముఖ నటుడు నందమూరి తారకరామారావు జన్మదినాన్ని పురస్కరించుకొని ఎన్టీఆర్ ఫ్యాన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిరు ముదిరాజ్ ఆధ్వర్యంలో సోమవారం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా జమ్మిచేడులోని జమ్ములమ్మ ఆలయంలో ఎన్ టిఆర్ పేరు మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షచారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పేద ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 200 మంది చిన్నారి పేషంట్లకు, డెలివరీ పేషెంట్స్ పండ్లు, బ్రెడ్ వాటర్ బాటిల్స్ పంపిణి చేశారు. అనంతరం ఎన్టీఆర్ సభ్యులు రక్తదానం చేశారు. జిల్లా అధ్యక్షులు చిరు ముదిరాజ్ మాట్లాడుతూ... ఎన్టీఆర్ అభిమానులు అంటే అభిమానం లో కేవలం బ్యానర్లు ఫ్లెక్సీలు, పబ్లిసిటీలు కాదు ప్రజాసేవకు పేద ప్రజలకు అండగా నిలిచే విధంగా ఎన్టీఆర్ అభిమానులు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో హాస్పిటల్స్ సూపరిండెంట్ డాక్టర్ కిషోర్ కుమార్, వైద్యులు డాక్టర్ శ్యామ్, ప్రదీప్ సాక్సోని, ఎన్ టి ఆర్ అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్, వీరేష్,సుభాన్, కృష్ణారెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ రమేష్ నవీన్, దయ, ఈశ్వర్, పరిష, తదితరులు పాల్గొన్నారు.

# రూ.35 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన గ్రామపంచాయతీ సెక్రటరీ, కారోబార్



ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ పంచాయతీ కార్యదర్శి, కరోబార్..




నానాజీ పూర్ పంచాయతి కార్యాలయం..

శంషాబాద్, మే 20(ప్రభాత ఉదయం ) సోమవారం ఏసీబీ అధికారులు జరిపిన దాడిలో శంషాబాద్ మండలంలోని నానాజీపూర్ గ్రామ కార్యదర్శి మాదిరెడ్డి రాధికా రెడ్డి. కారోబార్ బాలరాజు 35 వేల రూపాయల లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండ్ గా పట్టుబడ్డారు. ఈ సంఘటన శంషాబాద్ మండలంలోని నానాజీ పూర్ గ్రామంలో చోటు చేసుకునే. పాతబస్తీలోని యాకత్ పుర ప్రాంతానికి చెందిన బర్కత్ అలీ నానాజీపూర్ గ్రామంలో 500 చదరపు గజాల ప్లాటును ఖరీదు చేశారు. ఆ ప్లాటుకు ప్రహరీ గోడతో పాటు ఓ గది నిర్మానానికి అనుమతి కోసం పంచాయతీ కార్యదర్శి రాధిక రెడ్డిని సంప్రదించగా 60 వేల రూపాయల లంచం డిమాండ్ చేశారు. డబ్బులు ఇచ్చే వరకు నిర్మాణం చేపట్టకూడదని పనులను నిలిపివేశారు. దీనితో అతడు పంచాయతీ కారోబార్ ను సంప్రదించగా 50వేల రూపాయలు ఇవ్వాలని కోరారు. ఎట్టకేలకు 35వేల రూపాయలు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. దీనితో బర్కత్ అలీ ఏసీబీ అధికారులను సంప్రదించాడు. సోమవారం ఉదయం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద కారోబార్ బాలరాజు డబ్బులు తీసుకుంటూ ఉండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండుగా పట్టుకున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ ఆధ్వర్యంలో దాడి చేసి ఇద్దరు నిందితులను రెడ్ హ్యాండ్ గా పట్టుకున్నారు. కేవలం మూడు నెలల వ్యాధిలో శంషాబాద్ మండలంలో ఇద్దరు గ్రామపంచాయతీ కార్యదర్శులు కారోబార్ లు అవినీతి అధికారులకు చిక్కడం సంచలనంగా మారింది. మూడు నెలల క్రితం నర్కుడ గ్రామపంచాయతీ కార్యదర్శి లక్ష్మీ నరసింహ. పంచాయతీ కారోబార్ నాగరాజు పట్టుపడ్డారు. నానాజీ పూర్ పూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలోని ఇతర రికార్డులను కూడా అధికారులు పరిశీలించారు.

## సాక్షి దినపత్రిక సీనియర్ రిపోర్టర్ బుడిగెల బాబురావుకు

# జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జర్నలిస్టులు



సాక్షి దినపత్రిక రాజేంద్రనగర్ జోన్ ఇంచార్జ్ బుడిగెల బాబురావు ను కలసి జన్మ దిన శుభాకాంక్షలు తెలుపుతున్న సహచర జర్నలిస్టులు



బుడిగెల బాబురావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రభాత ఉదయం మేనేజింగ్ డైరెక్టర్ మేకల దామోదర్ రెడ్డి



బాబురావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కోరని మహేష్

బుద్వేల్, మే20(ప్రభాత ఉదయం) : సాక్షి రాజేంద్రనగర్ జోన్ ఇంచార్జ్ , సీనియర్ రిపోర్టర్ బుడిగెల బాబురావు జన్మదినం సందర్భంగా సోమవారం ఆయనను పలువులు జర్నలిస్టులు, నాయకులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్ కట్ చేయించి శాలువాలతో సన్మానించారు. ప్రజా సమస్యలను వెలికితీయడంలో బాబురావు ముందుండి పనిచేస్తున్నారని ప్రశంసించారు. దేవుడు బాబు రావు కు మంచి ఆరోగ్యాన్ని, సుఖ సంతోషాలను అనుగ్రహించాలని ప్రార్థించారు.



## 47వ సీనియర్ నేషనల్ త్రోబాల్ ఛాంపియన్ షిప్ షెడ్యూల్‌ని ప్రకటించిన తెలంగాణ స్టేట్ త్రోబాల్ అసోసియేషన్

### ఈవెంట్ నిర్వహణ తెలంగాణకు అవకాశం కల్పించిన త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు కృతజ్ఞతలు....

### టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి, మే 20 (ప్రభాత ఉదయం): సోమాజిగూడా ప్రెస్ క్లబ్ లో 47 వ సీనియర్ నేషనల్ త్రోబాల్ ఛాంపియన్ షిప్ షెడ్యూల్ ని త్రోబాల్ చైర్మన్ మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, చీఫ్ ప్యాట్రన్ అమీర్ అలీ ఖాన్, తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షులు, నేషనల్ గేమ్స్ ఆర్గనైజింగ్ చైర్మన్ టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, కోశాధికారి జమీల్, జనరల్ సెక్రటరీ కృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కృష్ణ రాజ్ పుత్, చిత్ర షెనోయ్, జాయింట్ సెక్రటరీ సిహెచ్. శ్రీనివాస్ లు ప్రకటించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సత్యం శ్రీరంగం మాట్లాడుతూ 47 వ సీనియర్ నేషనల్ త్రోబాల్ ఛాంపియన్‌షిప్ జూన్ 6 నుండి జూన్ 8, 2024 వరకు హైదరాబాద్‌లో ఈ గొప్ప ఈవెంట్‌ను నిర్వహించేందుకు తెలంగాణకు అవకాశం కల్పించిన త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ ఛాంపియన్‌షిప్‌కు సన్నాహకంగా, మా ఎంపిక బృందం తెలంగాణ త్రోబాల్ జట్టును మే 25, 2024న ఉదయం 10 గంటల నుండి హయత్‌నగర్‌లోని వర్ధ్ అండ్ డీడ్ ఎడ్యుకేషనల్ సొసైటీలో ఎంపిక చేస్తుందని, ఆసక్తిగల క్రీడాకారులు రావాలని అన్నారు. ఈ ఛాంపియన్‌షిప్‌ను స్మారక విజయంగా మరియు పాల్గొనేవారికి మరియు ప్రేక్షకులందరికీ మరపురాని అనుభూతిని అందించాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న పవర్ లిఫ్టింగ్ పోటిలలో ఇంటర్నేషనల్ గోల్డ్ మెడల్ సాధించిన బొంగు, శశాంత్ గౌడ్

## పవర్ లిఫ్టింగ్ పోటీలలో ఇంటర్నేషనల్ గోల్డ్ మెడల్ సాధించిన బొంగు శశాంత్ గౌడ్

హైదరాబాద్, మే 20(ప్రభాత ఉదయం) హైదరాబాద్ పాతబస్తీ గొల్లకిడికి ప్రాంతానికి చెందిన బొంగు శశాంత్ గౌడ్ హాంకాంగ్లో జరిగిన ఏషియన్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్, ఏషియన్ యూనివర్శిటీ ఆన్ (2024)లో పవర్ లిఫ్టింగ్ ఇంటర్నేషనల్ గోల్డ్ మెడల్ను సాధించారు, హాంకాంగ్లో జరిగిన ఏషియన్ ఎక్విప్ట్ పవర్ లిఫ్టిం ఏషియన్ యూనివర్శిటీ కప్ పోటీలలో పాతబస్తీ గొల్లకిడికి నివాసీ బొంగు, శశాంత్ గౌడ్ పాల్గొన్నారు. శశాంత్ గౌడ్ 120 ప్లస్ పోటీలలో గోల్డ్ మెడల్ సాధిం చిన సందర్భంగా పాతబస్తీ పురానాపూల్ నుంచి గొల్లకిడికి వరకు ర్యాలీ నిర్వహించారు. పెద్ద ఎత్తున శశాంత్ గౌడ్కు స్వాగతం వలికారు. ఈ సందర్భంగా తెలంగాణ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ చైర్మన్ బి. బుచ్చిదాస్ గౌడ్ మాట్లాడుతూ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులను అన్ని విధాల ప్రోత్సహించవసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఏషియన్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్, ఏషియన్ యూనివర్శిటీ కప్ (2024)లో పవర్ లిఫ్టింగ్ ఇంటర్నేషనల్ గోల్డ్ మెడల్ సిధించిన బొంగు శాంత్ గౌడ్ ప్రస్తుతం లా చదువుచున్నారు. పాతబస్తీ బహదూర్పుర అసెంబ్లీ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా శశాంత్ గౌడ్ కొనసాగుతున్నారు.కాగా శశాంత్‌గౌడ్ తండ్రి బొంగు వినోభాగౌడ్ కేరళలో 1987లో జరిగిన ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ (400) పోటీలలో బంగారు పతకాన్ని సాధించారు. ఈ కార్యక్రమలో తెలంగాణ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి జోసఫ్, హైదరాబాద్ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు త్యాగరాజు, కార్యదర్శి దయానంద్. రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.





దక్షిణ మండల జోనల్ కమిషనర్ వెంకన్న కు వినతి పత్రం అందచేస్తున్న రాజేంద్రనగర్ మండల గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి యతిపతి శ్రీధర్

## పత్తికుంటలో పూడిక తీత పనులు చేపట్టాలి : వై శ్రీధర్

బుద్వేల్, మే20(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ హనుమాన్ నగర్ సమీపంలో గల పత్తికుంట ( వినాయక సాగర్ ) లో పూడికతీత పనులు చేపట్టాలని కోరుతూ సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ దక్షిణ మండలం జోనల్ కమిషనర్ వెంకన్న కలిసి వినతిపత్రం అందజేశారు. రాజేంద్రనగర్ లోని పత్తికుంట ను అభివృద్ధి చేయాలన్నారు. రాబోయే వినాయక చవితి ఉత్సవాలు దృష్టి లో ఉంచుకొని ఇప్పుడే వర్షాలు కురిసే ముందే పత్తి కుంట పూడిక తీసి నిమజ్జనం సందర్భంగా భారీ విగ్రహాలు వేసే లాగా అవకాశం కల్పించాలని కోరారు. ప్రతీ సంత్సరము రాజేంద్రనగర్ ప్రాంతం లో ఉన్న విగ్రహాలు కాకుండా దూర. దూర ప్రాంతాల నుండి బారీ విగ్రహాలు పత్తి కుంట ప్రాంతానికి నిమజ్జానికి వస్తున్న విషయం గురించి జోనల్ కమిషనర్ కు వివరించారు. ఈ నేపథ్యంలో పత్తి కుంట శుభ్రం చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. జోనల్ కమిషనర్ ను కలసిన వారిలో వై శ్రీధర్ తో పాటు డి యదగిరి ఉన్నారు

## నేడు రాజేంద్రనగర్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం

బుద్వేల్, మే20(ప్రభాత ఉదయం) : ఈ నెల 21న (నేడు) రాజేంద్రనగర్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశాన్ని బుద్వేల్ లో నిర్వహిస్తున్నట్లు ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ కె. సుందర్ పాల్ , ప్రధాన కార్యదర్శి రెవరెండ్ ఈ. మనోహరం లు ఓ ప్రకటనలో తెలిపారు. జే సీ ఎఫ్ జీ ఎం చర్చ్ పాస్టర్ ఎబినేజర్ పాల్ ఆధ్వర్యంలో ప్రార్థన లు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రార్థనాలలో బైబిల్ సందేశాలను మహబూబ్ నగర్ రెమా వర్షిప్ సెంటర్ నిర్వాహకులు రెవరెండ్ సామ్యూల్ పరంజ్యోతి అందచేస్తారన్నారు.




## ఊర చెరువు బఫర్ జోన్‌లో నిర్మించిన ప్రహరి గోడ కూల్చివేత

రాజేంద్రనగర్, మే 29 (ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లి ఊర చెరువు ఎఫ్. టి. ఎల్, బఫర్‌జోన్‌ను ఆక్రమించి నిర్మించిన ప్రహారి గోడను రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్, నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం కూల్చివేశారు. శివరాంపల్లి జాగీర్ రెవెన్యూ పరిదిలోని సర్వేనెంబర్ 45లో ఎఫ్ టి ఎల్ ను ఆక్రమించి నిర్మించిన ప్రహారి గోడ నిర్మాణాన్ని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఎక్సవలేటర్ల సహాయంతో కూల్చివేశారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఖాదర్ మాట్లాడుతూ...అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదన్నారు. ఇప్పటికే చెరువు ఎఫ్ టీ ఎల్ పరిధిలో నిర్మాణమైన ఇళ్లకు కూడా నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. బఫర్ జోన్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని నీటి పారుదల శాఖ ఏఈ విశ్వం తెలిపారు. పలుచోట్ల నిర్మాణదారులు కూల్చి వేతలకు ఆటంకాలు కల్పించారు. కూల్చివేతల్లో రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కబీరుల్లా ఖాన్ సిబ్బంది పాల్గొన్నారు.





శివరాంపల్లి ఊర చెరువు బఫర్ జోన్ పరిధిలో వెలసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు



## రూ.1.10లక్షల ఎల్ఓసి అందజేత

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 20(ప్రభాత ఉదయం)గద్వాల నియోజకవర్గం గట్టు మండలం పరిధిలోని బోయలగూడెం గ్రామానికి చెందిన బి.చిన్నాన్న కు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన రూ.1.10 లక్షల ఎల్ఓసి లెటర్ ను సోమవారం హైదరాబాద్ లో ఎమ్మెల్యే క్వార్టర్స్ నందు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి లబ్దిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు



యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

## యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

యాదగిరిగుట్ట, మే 20(ప్రభాత ఉదయం) తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సోమవారం యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తో పాటు తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ ఫెడరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, తదితరులు దర్శించుకున్నారు

## మెడికల్ కళాశాలలో ఔట్సోర్సింగ్ విధానంలో పని చేయుటకు, వివిధ పోస్టులకు, నిబంధనల ప్రకారం ఎంపికైన అర్హులైన అభ్యర్థులు



### జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 20(ప్రభాత ఉదయం)గద్వాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేసేందుకు వివిధ పోస్టులకు వచ్చిన దరఖాస్తుల నుంచి అర్హులైన అభ్యర్థులను నిబంధనల ప్రకారం ఎంపిక చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ (స్థానిక సంస్థలు) తెలిపారు. సోమవారం గద్వాలలోని పాత ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆయా పోస్టులకు సంబంధించి జిల్లా సెలక్షన్ కమిటీ అధ్యక్షుడు, జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ ఆదేశాల మేరకు అధికారులు అభ్యర్థులను లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఔట్ సోర్సింగ్ విధానంలో ఎంపిక చేసేందుకు మొత్తం 24 పోస్టులకు గాను 2,370 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో డాటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులు 11 ఉండగా 672 మంది, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు 9 కి గాను 1483 మంది, మూడు ల్యాబ్ అటెండెంట్ పోస్టులకు 201 మంది, ఒక థియేటర్ అసిస్టెంట్ పోస్టుకు 14 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇందులో రోస్టర్ ప్రకారం రిజర్వేషన్ల వారీగా అభ్యర్థులు, మీడియా ప్రతినిధుల సమక్షంలో లాటరీ తీయగా థియేటర్ అసిస్టెంట్ పోస్టుకు ఉషారాణి ఎంపికైంది. ల్యాబ్ అటెండెంట్ పోస్టులకు భవాని, సమ్రిన్ బేగం, ఎండి సమీర్ ఎంపికయ్యారు. డాటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాలకు సులోచన రాణి, పూజిత, జయలక్ష్మి, హారిక, లక్ష్మి, శేఖర్ రెడ్డి, సువర్ణ, యశోద, ప్రసాదరావు, శైలజ, భాస్కర్ ఎంపికయ్యారు. ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు అనిత, సుందర్ రాజు, కళావతి, మంజుల, సుమలత, అన్వర్ భాష, పుష్పలత, ఉమలత, రేపల్లె జనార్ధన్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో కాంతమ్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్ బాబు, జిల్లా ఉపాధి కల్పన అధికారిణి ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.




10వ తరగతి బ్యాచ్ కు చెందిన రాకేష్ మరణించడంతో ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న 1987 - 88 బ్యాచ్ విద్యార్థులు

## రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1987-88లో చదువుకున్న 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బుద్వేల్, మే20(ప్రభాత ఉదయం): 1987-88 విద్యా సంవత్సరం లో రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం రాజేంద్రనగర్ కిద్వాయ్ కాటేజ్ లో సమావేశం అయ్యారు. పూర్వ విద్యార్థులు కాడెం సుధాకర్ , సురేష్ , మిత్రుల ఆద్వర్యం లో ఈ సమావేశం నిర్వహించారు. రాజేంద్రనగర్ బూద్వేల్ , కిస్మత్ పూర్, అత్తాపూర్, హైదర్ గూడ, రాజేంద్రనగర్, ప్రేమవతిపెట్, బండ్లగూడ ప్రాంతాల లో నివాసం ఉండే రాజేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాల 1987-88 బ్యాచ్ కు చెందిన నలభై మంది పూర్వ విద్యార్థుల ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమతో పాటు చదువుకుని అకాల మృత్యువు చెందినటువంటి దివంగత రాకేష్ (సింగర్) కు ఘన నివాళి అర్పించారు. సమావేశంలో పూర్వ విద్యార్థులు అందరూ తమ తమ సుఖ దుఃఖాలు ఒకరి కొకరు పంచుకున్నారు. ఈ స్నేహం తుది శ్వాస వరకు ఇలాగే ఉండాలని ప్రతిజ్ఞ చేశారు. ఒకరికి ఒకరు తోడు నీడగా, అన్న దమ్ముల వలే ఈ శేష జీవితం గడపాలని చాల ఆప్యాయంగా మాట్లాడుకోవడం జరిగింది. ఈ కార్యక్రమములో పూర్వ విద్యార్థులు మొండ్ర ఐలయ్య, తుల్జగారి శ్రీరాములు , ధనరాజ్, రఘునాథ్ రెడ్డి, శ్రీనివాస్ , ప్రవీణ్ కుమార్, మురళి , గోవింద్ రాజ్, రాజేందర్ , సురేష్, శంకర్, రాములు, మిత్రులు పాల్గొన్నారు

# కోల్‌కతా, హైదరాబాద్ మ్యాచ్‌కు వర్షం ముప్పు



మొదటి క్వాలిఫైయర్ మ్యాచ్ కోల్‌కతా నైట్ రైడర్స్ వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య మే 21న జరుగుతుంది. ఈ మ్యాచ్‌లో ఏ జట్టు గెలిచినా ఫైనల్స్‌కు చేరుకోవడంతోపాటు ఓడిన జట్టుకు మరో అవకాశం దక్కుతుంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఈ మ్యాచ్ జరగనుంది. ఇలాంటి పరిస్థితుల్లో అహ్మదాబాద్‌లో జరిగే మ్యాచ్‌కు వర్షం మరోసారి అంతరాయం కలిగిస్తుందా అన్నది అభిమానుల మదిలో మెదులుతోంది. గతంలో ఓ మ్యాచ్‌లోనూ ఇలాగే జరిగింది. గుజరాత్ టైటాన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య మే 13న అహ్మదాబాద్‌లో మ్యాచ్ జరగాల్సి ఉండగా.. ఆ మ్యాచ్‌లో భారీ వర్షం కురిసింది. అహ్మదాబాద్‌లో భారీ వర్షం కురవడంతో టాస్ కూడా వేయలేక మ్యాచ్‌ను రద్దు చేయాల్సి వచ్చింది. ఇప్పుడు మరోసారి %ఖఖ=% జట్టు తన క్వాలిఫయర్ మ్యాచ్ ఆడేందుకు అదే మైదానంలోకి అడుగుపెట్టనుంది. ఇలాంటి పరిస్థితుల్లో మరోసారి వర్షం కురిసి మ్యాచ్ మజాను చెడగొడుతుందన్న భయం అభిమానుల్లో నెలకొంది. వాతావరణ శాఖ మేరకు, మే 21న అహ్మదాబాద్‌లో వర్షం కురిసే సూచన లేదు. వాతావరణం స్పష్టంగా ఉండే అవకాశం ఉంది. రోజంతా ఎండగా ఉండవచ్చు. అయితే, వేడి చాలా ఎక్కువగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత 44 డిగ్రీల వరకు కూడా పెరుగుతుంది. అభిమానులకు మంచి విషయం ఏమిటంటే, వారు మొత్తం మ్యాచ్‌ను చూడగలుగుతారు. వర్షం కారణంగా ఎటువంటి ఆటంకం ఉండదు. వర్షం కురిసినా అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్లేఆఫ్ మ్యాచ్‌లలో రిజర్వ్ డే ఉంది. నిర్ణీత రోజున మ్యాచ్‌ను ముగించడానికి 120 నిమిషాల అదనపు సమయం అందుబాటులో ఉంది. ఒకవేళ వర్షం కారణంగా మ్యాచ్ సాధ్యం కాకపోతే రిజర్వ్ డే రోజున ఆడతారు. ఐపీఎల్ లీగ్ దశలో కోల్‌కతా నైట్ రైడర్స్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. %ఖఖ=% 14 మ్యాచ్‌లలో 9 గెలిచింది. రెండు మ్యాచ్‌లు ఫలితం ఇవ్వలేదు. దీంతో కేకేఆర్ 20 పాయింట్లతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. అదే సమయంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు 17 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది.



## హైదరాబాద్‌ను భయపెడుతున్న

# కేకేఆర్ ప్లే ఆఫ్స్ రికార్డ్!

ఐపీఎల్ 2024 సీజన్ తుది దశకు చేరింది. 70 లీగ్ మ్యాచ్ అనంతం పాయింట్స్ టేబుల్‌లో టాప్-4లో నిలిచిన కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్), సన్‌రైజర్స్ హైదరాబాద్,రాజస్తాన్ రాయల్స్ ,రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించాయి. టోర్నీ రూల్స్ ప్రకారం టాప్-2లో నిలిచిన కేకేఆర్, ఎస్‌ఆర్‌హెచ్ మంగళవారం అహ్మదాబాద్ వేదికగా జరగనున్న తొలి క్వాలిఫయర్ మ్యాచ్‌లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. అయితే ఈ మ్యాచ్‌కు ముందు కేకేఆర్ ప్లే ఆఫ్స్ రికార్డ్స్ సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులను కలవరపెడుతోంది. 17 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో కేకేఆర్ 13 సార్లు ప్లే ఆఫ్స్ చేరింది. ఇందులో రెండు సార్లు టైటిల్ గెలిచిన ఆ జట్టు.. ఐదు సార్లు ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఓవరాల్‌గా 8 సార్లు ప్లే ఆఫ్స్‌లో కేకేఆర్ గెలిచింది. ఐపీఎల్ 2011: గౌతమ్ గంభీర్ సారథ్యంలో కేకేఆర్ తొలిసారి 2011లో ప్లే ఆఫ్స్ చేరింది. ఆ సీజన్‌లో ముంబై ఇండియన్స్‌తో జరిగిన ఎలిమినేటర్‌లో 4 వికెట్ల తేడాతో ఓడి ఇంటిదారి పట్టింది. ఐపీఎల్ 2012: ఆ మరుసటి ఏడాది మరోసారి గంభీర్ సారథ్యంలోనే ప్లే ఆఫ్స్ చేరిన కేకేఆర్.. క్వాలిఫయర్-1లో ఢిల్లీ క్యాపిటల్స్‌ను 18 పరుగులతో ఓడించి ఫైనల్ చేరింది. ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌ను 5 వికెట్ల తేడాతో ఓడించి తొలి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఐపీఎల్ 2014: గంభీర్ సారథ్యంలోనే 2014లో ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించిన కేకేఆర్.. ఫస్ట్ క్వాలిఫయర్‌లో పంజాబ్ కింగ్స్‌ను 28 పరుగుల తేడాతో ఓడించి ఫైనల్ చేరింది. మళ్లీ ఫైనల్లో పంజాబ్‌ను 3 వికెట్ల తేడాతో ఓడించి రెండో సారి టైటిల్ అందుకుంది. ఐపీఎల్ 2016: రెండేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ 2016లో ప్లే ఆఫ్స్ చేరిన కేకేఆర్.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో 22 పరుగుల తేడాతో ఓడి ఇంటిదారి పట్టింది. ఐపీఎల్ 2017: ఆ మరుసటి ఏడాది మళ్లీ ప్లే ఆఫ్స్ చేరిన కేకేఆర్.. ఈసారి ఎలిమినేటర్‌లో సన్‌రైజర్స్‌ను 7 వికెట్లతో ఓడించి ప్రతీకారం తీర్చుకుంది. క్వాలిఫయర్-2లో ముంబై ఇండియన్స్ చేతిలో 6 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఐపీఎల్ 2018: వరుసగా మూడో ఏడాది ప్లే ఆఫ్స్ చేరిన కేకేఆర్.. ఎలిమినేటర్‌లో రాజస్థాన్ రాయల్స్‌ను 25 పరుగుల తేడాతో ఓడించింది. కానీ రెండో క్వాలిఫయర్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో 14 పరుగుల తేడాతో ఓటమిపాలై ఇంటిదారి పట్టింది. ఐపీఎల్ 2021: ఆ తర్వాత రెండేళ్ల పాటు తీవ్రంగా నిరాశ పరిచిన కేకేఆర్.. 2021లో మరో ప్లే ఆఫ్స్ చేరింది. ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఆర్‌సీబీ 4 వికెట్ల తేడాతో ఓడించిన ఆ జట్టు.. రెండో క్వాలిఫయర్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌ను 3 వికెట్ల తేడాతో ఓడించి ఫైనల్‌కు చేరింది. కానీ ఫైనల్లో చెన్నై సూపర్ కింగ్స్ చేతిలో 27 పరుగులతో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఐపీఎల్ 2024: ఆ తర్వాత రెండేళ్లు తీవ్రంగా నిరాశపరిచిన కేకేఆర్.. మెంటార్‌గా గంభీర్ జట్టులోకి రీఎంట్రీ ఇవ్వడంతో సంచలన ప్రదర్శనతో టేబుల్ టాపర్‌గా నిలిచి క్వాలిఫయర్-1కు సిద్ధమైంది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను ఓడిస్తుందా..? గతంలో మాదిరి ఓడిపోతుందా? అనేది చూడాలి.

# సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌కు ఫిల్ సాల్ట్ దూరం

ఐపీఎల్ 2024 సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) కీలక పోరుకు సిద్దమైంది. అసాధారణ ప్రదర్శనతో టేబుల్ టాపర్‌గా నిలిచిన కేకేఆర్.. మంగళవారం అహ్మదాబాద్ వేదికగా జరిగే క్వాలిఫయర్-1లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించి ఎలాంటి రిస్క్ లేకుండా ఫైనల్ చేరాలని కేకేఆర్ భావిస్తోంది. 11 మ్యాచ్‌ల్లో 9 విజయాలతో పూర్తి ఆధిపత్యం చెలాయించిన కేకేఆర్.. ప్లే ఆఫ్స్‌లోనూ అదే జోరును కొనసాగించాలనుకుంటుంది. అయితే కేకేఆర్ ఆడాల్సిన చివరి రెండు లీగ్ మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి. దాంతో ఆ జట్టుకు రెండు వారాలుగా మ్యాచ్ ప్రాక్టీస్ లేకుండా పోయింది. అంతేకాకుండా కేకేఆర్ విజయాల్లో కీలక పాత్ర పోషించిన విధ్వంసకర ఓపెనర్ ఫిల్ సాల్ట్ కీలక మ్యాచ్‌లకు దూరమయ్యాడు. పాకిస్థాన్‌తో టీ20 సిరీస్ నేపథ్యంలో ఈ ఇంగ్లండ్ బ్యాటర్ స్వదేశం పయనమయ్యాడు. దాంతో అతని స్థానంలో కేకేఆర్ అఫ్గాన్ ఓపెనర్ రెహ్మానుల్లా గుర్బాజ్‌తో బరిలోకి దిగే అవకాశం ఉంది. ఈ ఒక్క మార్పు మినహా తుది జట్టులో ఎలాంటి మార్పులు చేసే అవకాశం లేదు. పిచ్‌కు అనుకూలించే అహ్మదాబాద్ వేదికగా ఈ మ్యాచ్ జరుగుతుండటం కేకేఆర్‌కు కలిసొచ్చే అంశం. అంతేకాకుండా మెంటార్‌గా గౌతమ్ గంభీర్ ఉండటం ఆ జట్టుకు వెయ్యి ఏనుగుల బలం. పరిస్థితులకు తగ్గట్లు వ్యూహాలు రచించడంతో గంభీర్ దిట్ట. అతని మార్గదర్శకత్వంలోనే కేకేఆర్ వరుస విజయాలతో టేబుల్ టాపర్‌గా నిలిచింది. లీగ్ దశలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల్లోనూ కేకేఆర్ విజయం సాధించింది. ఫిల్ సాల్ట్ దూరమైనా కేకేఆర్ బ్యాటింగ్ లైనప్ భీకరంగా ఉంది. సునీల్ నరైన్, వెంకటేశ్ అయ్యర్, శ్రేయస్ అయ్యర్, నితీష్ రాణా, ఆండ్రీ రస్సెల్ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. రింకూ సింగ్ కూడా తన బ్యాటింగ్‌కు పని చెప్పితే కేకేఆర్‌కు తిరుగుండదు. హర్షిత్ రాణా, మిచెల్ స్టార్క్, ఆండ్రీ రస్సెల్‌తో పేస్ విభాగం కూడా పటిష్టంగా ఉంది. స్పిన్నర్లు సునీల్ నరైన్, వరుణ్ చక్రవర్తీలకు తిరుగు లేదు. తుది జట్టులోని ఆటగాళ్లంతా సమష్టిగా రాణిస్తే కేకేఆర్ సునాయస విజయాన్ని అందుకోనుంది. వైభవ్ అరోరాను ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడించే ఛాన్స్ ఉంది. హెడ్ టు హెడ్ రికార్డ్స్‌లోనూ సన్‌రైజర్స్‌పై కేకేఆర్‌దే పై చేయి కావడం గమనార్హం. ఇరు జట్లు ఇప్పటి వరకు 29 మ్యాచ్‌లు ఆడగా.. కేకేఆర్ 17, సన్‌రైజర్స్ 9 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. ఓ మ్యాచ్ ఫలితం తేలలేదు.





## బ్యాలెన్స్ రూ.6 లక్షలు ఇస్తామన్నా పాయల్ రాజ్‌పుత్ ప్రచారానికి రాలేదు:

### నిర్మాతల మండలి

తెలుగు సినీ పరిశ్రమ నుంచి తనని బ్యాన్ చేయాలని చూస్తున్నారని నటి పాయల్ రాజ్‌పుత్ సోషల్‌మీడియా వేదికగా పోస్టు పెట్టడాన్ని తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి ఖండించింది. ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. "ప్రదీప్ ఠాకూర్ స్వీయ దర్శకత్వంలో పాయల్ రాజ్‌పుత్ నటించిన 'రక్షణ' చిత్రాన్ని ఏప్రిల్ 19న విడుదల చేయాలని భావించారు. కానీ, ఈ సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొనేందుకు పాయల్ రాజ్‌పుత్ సుముఖత వ్యక్తం చేయలేదు. 'నాలుగేళ్ల కిందటి సినిమా. ఇప్పుడు దానికి నేను ప్రమోషన్ చేయలేను. కావాలంటే ఓటీటీలో విడుదల చేసుకోండి' అంటూ సలహా ఇచ్చారు. ఒప్పందం ప్రకారం.. సినిమా కోసం 50 రోజులు డేట్స్ ఇవ్వడంతో పాటు, ప్రమోషన్స్‌లోనూ పాల్గొనాలి. ఆమె 47 రోజులు షూటింగ్‌లో పాల్గొన్నారు. కొవిడ్, ఇతర ఆర్థిక సమస్యల కారణంగా సినిమా అనుకున్న సమయానికి విడుదల చేయలేకపోయారు. ఇప్పుడు విడుదల తేదీ ప్రకటించి, ఆమెను ప్రచారానికి పిలిస్తే సరైన స్పందన లేదు. సినిమా విడుదలకు ఆమెకు ఇవ్వాల్సిన మిగిలిన పారితోషికం రూ.6 లక్షలు ఇస్తామని కూడా చెప్పారు. ఇందుకు సంబంధించిన చెక్‌ను కూడా డిపాజిట్ చేశారు. అయినా కూడా పాయల్ ముందుకురాలేదు" "ఇలా చేయడం వల్ల ప్రదీప్ ఠాకూర్ సినిమాపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఆమెపై చర్యలు తీసుకోవాలని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌కు ఫిర్యాదు చేశాం. పాయల్ అందులో సభ్యురాలు కాకపోవడంతో ఎలాంటి చర్యలు తీసుకోలేకపోయారు. ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేస్తే, పాయల్ మేనేజర్‌ను పిలిచి సమస్యను పరిష్కరించాలని సూచించారు. దీంతో పాయల్ ప్రమోషన్స్‌కు వస్తుందని మొదట చెప్పి, ఆ తర్వాత మాట మార్చారు. ఈ విషయమై పదేపదే ఆయనతో మాట్లాడినా సరైన స్పందన లేదు.

# ఇక మరింత బిజీగా నటి రష్మిక

## వరుస సినిమాలతో దూసుకుపోతున్న కన్నడ బ్యూటీ



ప్రస్తుతం రష్మిక మందన్నా క్రేజ్ ని మ్యాచ్ చేయడం చాలా కష్టం. మిగతా హీరోయిన్స్ ఆమె దరిదాపుల్లో కూడా లేరు. ఒకటి కాదు రెండు కాదు.. ఆమె చేతిలో ప్రస్తుతం తొమ్మిది క్రేజీ సినిమాలు ఉన్నాయి. అందులో టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ ఇలా ప్రతీ ఇండస్ట్రీలో సినిమాలు చేస్తూ మిగతా హీరోయిన్స్ కి గట్టి పోటీని ఇస్తోంది. రష్మిక చేస్తున్న మోస్ట్ వాంటెడ్ సినిమాల్లో పుష్ప ఒకటి. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా చేస్తున్న ఈ సినిమాను స్టార్ డైరెక్టర్ సుకుమార్ తెరకెక్కిస్తున్నాడు. భారీ అంచనాలు ఉన్న ఈ సినిమా ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా తరువాత ధనుష్ ప్రధాన ప్రాత్రలో వస్తున్న కుబేర సినిమాలో నటిస్తోంది. తెలుగు దర్శకుడు శేఖర్ కమ్ముల తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో కింగ్ నాగార్జున కూడా కీ రోల్ చేస్తున్నారు. పాన్ ఇండియా లెవల్లో వస్తున్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక రౌడీ హీరో విజయ్ దేవరకొండతో కూడా మరో సినిమా చేస్తోంది. దిల్ రాజు నిర్మాణంలో రవి కిరణ్ కోలా తెరకెక్కిస్తున్న ఈ సినిమా ఇటీవలే లాంఛనంగా మొదలయింది. చిలసౌ ఫేమ్ దర్శకుడు రాహుల్ రవీంద్ర తెరకెక్కిస్తున్న ది గర్ల్ ఫ్రెండ్ సినిమా చేస్తుంది రష్మిక. గీత ఆర్ట్స్ నిర్మిస్తున్న ఈ సినిమా కూడా పాన్ ఇండియా లెవల్లో తెరకెక్కుతోంది. తమిళ దర్శకుడు సిబి చక్రవర్తి నేచురల్ స్టార్ నానితో ఓ సినిమా చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాలో కూడా హీరోయిన్ గా రష్మికను ఫిక్స్ చేశారని సమాచారం. ఇక తమిళ్ విషయానికి వస్తే అక్కడ కూడా వరుస సినిమాలు చేస్తోంది రష్మిక.. అక్కడ ముందుగా సూర్య హీరోగా స్టార్ డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజు తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా మూవీలో హీరోయిన్ గా రష్మిక నటిస్తోందట. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన రానుంది. ఇక శివ కార్తికేయన్ హీరోగా దర్శకుడు ఏఆర్ మురుగదాస్ చేస్తున్న సినిమాలో కూడా రశ్మికనే హీరోయిన్. ఇక హిందీలో కూడా రష్మిక బంపర్ ఆఫర్ కొట్టేసింది. ఇప్పటికే ఆమె హిందీలో చవా సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది. ఈ సినిమా తరువాత బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ తో సినిమా చేసే అవకాశం దక్కించుకుంది రష్మిక. సల్మాన్ ఖాన్ హీరోగా తమిళ దర్శకుడు ఏఆర్ మురుగదాస్ సికిందర్ అనే పాన్ ఇండియా మూవీ చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే అధికారికంగా మొదలైన ఈ సినిమాలో రశ్మికన్నుౢ÷నైల్ చేశారట టీమ్. ఇలా వరుసగా సినిమాలు చేస్తూ.. మిగతా హీరోయిన్స్ టచ్ చేయలేని రేంజ్ లో ఉంది రష్మిక.

# మగబిడ్డకు జన్మనిచ్చిన యామీగౌతమి

## వేదవిద్ పేరు పెట్టామంటూ ప్రకటన

నటి యామీ గౌతమ్ పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని ఆమె భర్త ఆదిత్యాధార్ సోషల్ మీడియా వేదికగా తెలిపారు. ఆ బాబుకు 'వేదవిద్' అని పేరు పెట్టినట్లు వెల్లడించారు. ఆయన పోస్ట్‌కు నెటిజన్లు శుభాకాంక్షలతో కామెంట్లు చేస్తున్నారు. 'యామీ గౌతమ్ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అక్షయ తృతీయ లాంటి పర్వదినాన మాకు మగ బిడ్డ పుట్టాడు. మరొక అందమైన ప్రయాణాన్ని ప్రారంభించాం. అందరి ఆశీస్సులతో మా కుమారుడికి గొప్ప భవిష్యత్తు ఉండాలని కలలు కంటున్నాం. అతడు ఎన్నో ఉన్నతమైన శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నాం. మా కుటుంబానికి అలాగే దేశానికి గర్వకారణమయ్యేలా ఎదగాలని ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు. అలాగే ఆస్పత్రిలో సహకరించిన సిబ్బందికి కృతజ్ఞతలు చెప్పారు. యామీ-ఆదిత్య ధార్ 2021లో పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. 'నువ్విలా'తో తెలుగు తెరకు పరిచయమైన యామీ గౌతమ్ పలు బాలీవుడ్ సినిమాలతో పాపులర్ అయ్యారు. అదే సమయంలో 'గౌరవం', 'యుద్ధం', 'కొరియర్ బాయ్ కల్యాణ్' చిత్రాలతో టాలీవుడ్ ప్రేక్షకులను అలరించారు. ఇటీవల ఆమె నటించిన 'ఆర్టికల్ 370' ఈవెంట్‌లో తల్లికానున్నట్లు ప్రకటించారు.



# ఎన్టీఆర్-నీల్ మూవీ

## ఆగస్టులో షూటింగ్ ఉంటుందని ప్రకటన

ప్రపంచ వ్యాప్తంగా ఎన్టీఆర్‌కు ఉండే క్రేజ్, ఫ్యాన్ బేస్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అంచనాలకు అనుగుణంగానే తారక్ భారీ, క్రేజీ సినిమాలను లైనప్ చేస్తున్నారు. అందులో భాగంగా కె.జి.యఫ్, సలార్ వంటి బ్లాక్ బస్టర్ చిత్రాలను తెరకెక్కించిన డైరెక్టర్ ప్రశాంత్ నీల్‌తో ఎన్టీఆర్ సినిమా చేస్తున్నారు. 'ఎన్టీఆర్ నీల్' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ మూవీ ప్రారంభం కానుంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చి చాలా కాలమైంది. ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఎన్టీఆర్ నీల్ మూవీ షూటింగ్‌ను ఆగస్ట్ 2024 నుంచి ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. తారక్ బర్త్ డే రోజున ఫ్యాన్స్‌కి సర్‌ప్రైజ్‌నిస్తూ మేకర్స్ ఇచ్చిన ఈ అప్‌డేట్ అందరికీ థ్రిల్లింగ్‌గా అనిపించింది.



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.